సాక్షి ఒడిశా
గురువారం । 1 । మే । 2025



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,46,586లు, బంగారం 4 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 19 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**ఘనంగా అక్షయ తృతీయ**
రాష్ట్రవ్యాప్తంగా అక్షయ తృతీయ, వ్యవసాయ పండగలను ఘనంగా బుధవారం నిర్వహించారు.
- 8లో.



**వైభవంగా రామాలయ ప్రతిష్ట**
కొరాపుట్ జిల్లా కేంద్రంలోని పూజారిపుట్‌లో రామాలయ ప్రతిష్ట వైభవంగా బుధవారం నిర్వహించారు.
- 8లో.

## న్యూస్‌రీల్

### త్రుటిలో తప్పిన ప్రమాదం



పొదల్లోకి దూసుకెళ్లిన లక్ష్మీ బస్సు

రాయగడ: బిసంకటక్ నుంచి పర్లాలికి వెళ్తున్న లక్ష్మీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బుధవారం ఈ ఘటన పాతలొంబ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఉదయం ప్రయాణికులతో బిసంకటక్ నుంచి బయల్దేరిన బస్సు పాతలొంబ గ్రామానికి చేరేసరికి మలుపు వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకుపోయింది. గత రెండు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో మలుపు వద్ద మట్టి పేరుకుపోయింది. దీంతో బస్సు అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలవ్వకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

### పిడుగుపాటుకు 11 ఆవులు మృతి



మృతిచెందిన ఆవులు

కొరాపుట్: పిడుగుపాటుకి 11 ఆవులు మృతి చెందిన ఘటన కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితి సంగల్బేడా గ్రామ పంచాయతీ పుల్బాడి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఆవుల మందపై పిడుగులు పడడంతో మొత్తం 11 ఆవులు మృత్యువాత పడ్డాయి. దీంతో యజమానులు విలపిస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

### పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పొలంలో విత్తనాలు చల్లుతున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు

పర్లాకిమిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. బుధవారం రైతు దినోత్సవం, పవిత్ర అక్షయ తృతీయ సందర్భంగా జిల్లా వ్యవసాయ మరియు కృషక్ స్వశక్తీకరణ ఆధ్వర్యంలో బి.ఎస్.ప్యాలస్ రోడ్డులో అధికారులు దుక్కులు దున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి రవీంద్రకుమార అడెక్, జల విభాజన మరియు ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ కుమార్ పట్నాయిక్, ఉద్యానవనాల శాఖ ఉపసంచాలకులు సుకాంత్ రంజన్ దాస్, అదనపు ప్రాణి చికిత్సా అధికారి డాక్టర్ రమాకాంత రోణా తదితరులు పాల్గొన్నారు.

### నూతన భవనం ప్రారంభం



నూతన భవనం ప్రారంభిస్తున్న తిరుపతిరావు

పర్లాకిమిడి: స్థానిక తెలుగు సొండివీధి సరస్వతీ శిశు విద్యామందిర్ సమీపంలో వందేమాతరం నృత్య, సంగీత పాఠశాల నూతన భవనాన్ని బుధవారం జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు ప్రారంభించారు. సుమారు 23 సంవత్సరాల నుంచి ఈ నృత్య, సంగీత అకాడమీ అద్దె భవనంలో నడుస్తోంది. ప్రస్తుతం ఈ సంగీత, నృత్య అకాడమీలో 32 మంది విద్యార్థులు, 5 మంది గురువులు శిక్షణ అందిస్తున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బసంతకుమార్ పటానాయిక్, రాజీవ్ లోచన పండా, రబి పాణిగ్రాహి, అమూల్య పాత్రో, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమందిరం నుంచి తరలి వస్తున్న ఆజ్ఞామాలలు



రథాల తయారీకి ఎంపికైన ప్రధాన కలప దుంగలు



# రథాల తయారీకి.. అంకురార్పణ

- శ్రీమందిరంలో ఘనంగా అక్షయ తృతీయ
- ప్రారంభమైన చందన యాత్ర
- 42 రోజుల పాటు జరగనున్న చందన యాత్ర

భువనేశ్వర్: జగతినాథుడు కొలువుదీరిన శ్రీక్షేత్రం (పూరీ)లో పవిత్ర అక్షయ తృతీయ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. శ్రీ జగన్నాథుని సంస్కృతిలో ఈ తిథితో విశ్వ విఖ్యాత రథయాత్ర ముడిపడి ఉంది. అక్షయ తృతీయ పురస్కరించుకుని ఈ ఏడాది జరగనున్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన



రథ తయారీ అంకురార్పణ పూజా దృశ్యం

రథయాత్ర కోసం రథాల నిర్మాణం బుధవారం నుంచి ప్రారంభించారు. దీంతో 42 రోజుల పాటు జరిగే ప్రసిద్ధ చందన యాత్ర నేటి నుంచి ప్రారంభమైంది. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు శ్రీమందిరం సింహ ద్వారం తలుపులు తెరిచి లోపలి భాగాన్ని శుభ్రం చేసి మంగళ హారతి సమర్పించారు. మధ్యాహ్న ధూపం 1.15 నుంచి 2.30 గంటల మధ్య నిర్వహించారు. మధ్యాహ్న ధూపం తర్వాత శ్రీమందిరం రత్న వేదిక నుంచి దేవతా త్రయం మూడు ఆజ్ఞామాలలు రథ తయారీ ప్రాంగణానికి చేరాయి. ఈ సందర్భంగా బాజాభజంత్రీలు, మేళతాళాలతో పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అలముకున్నాయి. స్వామివార్షిక రథయాత్రకు ఇది ఆరంభ సంకేతంగా భక్తుల హృదయం పులకించింది. వన జాగరణ ఆచారం ప్రకారం రథ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ పూజారులు (దెవుళో పురోహిత్), రాజ గురువు, శాస్త్రీ బ్రాహ్మణులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శాలలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నృసింహ మంత్రంతో నృసింహ స్వామియాగం నిర్వహించారు. ప్రత్యేక ఆచారాల ప్రకారం, ఆలయ పూజారి ముందుగా మూడు చెక్క దుంగలను స్పర్శింపజేశారు. దక్షిణ కాళీమాత మంత్రోచ్ఛరణతో పవిత్రం చేశారు. వెంబడి విశ్వకర్మలు రథాల నిర్మాణానికి సిద్ధం అయ్యారు. రథ నిర్మాణ అధిపతి (ముఖ్య విశ్వకర్మ), ప్రధాన భోయి సేవకుడు, చిత్రకారుడు, రూపకారుడు, కమ్మరి మొదలైన 10 వర్గాల మహారణల తలలకు పాగా (సాఢి బొంధొ) చుట్టి రథాల తయారీ పనులకు స్వాగతించారు. ఇతరేతర లాంచనాలు పూర్తి చేయడంతో మహరణ సేవకుల వర్గం రథాల నిర్మాణం ప్రారంభం చేపట్టింది.

**చందన యాత్ర**

శ్రీమందిరం రత్న వేదికపై ఆసీనుడైన శ్రీజగన్నాథ స్వామివారికి చందన లేపిత సేవ ఆరంభమైంది. పవిత్ర అక్షయ తృతీయ పురస్కరించుకుని బుధవారం నుంచి ఈ సేవ ప్రారంభం కావడం విశేషం. స్నాన పూర్ణిమ రోజు వరకు 42 రోజుల పాటు నిరవధికంగా కొనసాగుతుంది. ఈ 42 రోజుల పాటు స్వామి నిత్యం చందన యాత్రలో పాల్గొంటాడు. తొలి సగం రోజులు (21) వెలుపలి చందన యాత్ర, చివరి సగం రోజులు (21) అంతర్ చందన యాత్రగా స్వామి నిత్యం సంధ్య వేళలో ఉత్సవం జరుపుకుంటాడు. వెలుపలి చందన యాత్రలో భాగంగా నిత్యం సంధ్య వేళలో పల్లకిలో ఊరేగుతూ నరేంద్ర పుష్కరిణి తీరం చేరుతాడు. ఈ పుష్కరిణిలో కొన్ని గంటల సేపు దేవేరులతో కలిసి నావికా విహారంలో పాల్గొంటారు. పుష్కరిణిలో నంద మరియు భద్ర అనే నావలపై దేవదేవుళ్ల జల క్రీడల్లో పాల్గొని భక్తులను మురిపిస్తారు. చివరి 21 రోజులు అంతర్ చందన యాత్రగా శ్రీ మందిరం లోపలి ప్రాకారంలో జరుగుతుంది.

**నిత్యం చందన లేపనం**

అక్షయ తృతీయ అత్యంత ఆనందోత్సాహాలతో జరిగే పండగగా స్వామి భక్తులు పరిగణిస్తారు. అక్షయ తృతీయ నుంచి స్నాన పూర్ణిమ వరకు నిత్యం భోగ మండప సేవ తర్వాత చందన లేపనం చేస్తారు. ఈ సందర్భంగా మూల విరాటుల సాధారణ వస్త్రధారణ తొలగించి శుక్ల వర్ణ వస్త్రాలను తొడుగుతారు. ఈ వస్త్రం పొడవు 10 మూరలు మరియు వెడల్పు 3 మూరలు ఉంటుంది. దీనిని చందన్ గొథా అని వ్యవహరిస్తారు. ఈ సేవలో భాగంగా సుగంధిత పుష్పాదులతో మూల విరాటుల్ని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఇదే తరహాలో శ్రీ మందిరం సింహద్వారం ఆవరణలో తొలి దర్శనం ఇచ్చే పతిత పావనుని కుడ్య ప్రతిమకుల అలంకరణ, సేవాదులు నిర్వహించడం ఆచారం. అల్లంత దూరం నుంచి ఆరు బయట నుంచి దర్శనం ఇచ్చి పతితుల్ని పావనం చేసే భగవంతుడుగా నిత్య దర్శనం ప్రసాదిస్తాడు.



చందన లేపిత పుష్ప శోభతో పతిత పావనుడు



శ్రీమందిరానికి అక్షయ తృతీయ శోభ

## బాధిత కుటుంబాలకు చేయూత





మహిళలకు చెక్కులు, నియామక పత్రాలు అందజేస్తున్న సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: విధి నిర్వహణలో అకాల మరణం పాలైన ఇద్దరు పోలీసు సిబ్బంది కుటుంబాలకు ముఖ్యమంత్రి చేయూతనిచ్చి ఆదుకున్నారు. దివంగత సిబ్బంది భార్యలకు హోం గార్డు ఉద్యోగం కల్పించారు. స్థానిక లోక్‌సేవా భవన్‌లో బుధవారం ముఖ్యమంత్రి నియామక పత్రం మరియు సహాయ నిధి కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రభాసిని బెహరా, దేవి షబర్ నియామకపత్రంతో పాటు చెక్కులు అందుకున్నారు. వీరి ఇద్దరు భర్తలు పీసీఆర్ వ్యాన్‌లో డ్యూటీలో ఉండగా ప్రమాదంలో ఇటీవల మరణించారు.

## • భళా నృత్య కళ





అక్షయ తృతీయ పురస్కరించుకొని శ్రీజగన్నాథ మందిరం సన్నిధిలో అడపా మండపంలో బుధవారం సాయంత్రం ఒడిస్సీ నృత్యాన్ని పర్లాకిమిడికి చెందిన మూర్ఛన్న కళా పరిషత్ కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. అంతర్జాతీయ వేదిక మలేషియాలో ప్రదర్శించిన డి.ప్రియాంక నేతృత్వంలో ఈ ఒడిస్సీ నృత్యం ప్రదర్శించారు.

\- పర్లాకిమిడి

## లక్ష్మీనృసింహునికి ప్రత్యేక అభిషేకాలు



అభిషేకాలు చేస్తున్న అర్చకులు

రాయగడ: కొలనార సమితి అమలాభట్ట వద్దనున్న శ్రీక్షేత్రటౌన్ షిప్‌లోని శ్రీలక్ష్మీ నృసింహ ఆలయంలో పవిత్ర అక్షయ తృతీయ పురస్కరించుకొని మంగళవారం నుంచి చందనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మంగనాథ్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం ఆరాధన, దీపారాధన, క్షీరాభిషేకాలతో పాటు చందనాభిషేకాలు చేపట్టారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్‌రావు పరివేక్షణలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

## వ్యవసాయ రంగానికి పెద్దపీట



విత్తనాలు నాటుతున్న మంత్రి గొండా



దుక్కు దున్నుతున్న మంత్రి గొండా

- మంత్రి నిత్యానంద గొండా

రాయగడ: రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ఆదివాసీ, హరిజన, వెనుకబడిన, మైనారిటీ వర్గాల సంక్షేమ శాఖల మంత్రి నిత్యానంద గొండా అన్నారు. పవిత్ర అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం గుణుపూర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీనిలో భాగంగా ముందుగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం పొలం దున్ని, విత్తనాలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న ఉద్దేశంతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. రైతులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, బీజేపీ నాయకులు శివశంకర్ ఉలక, రబి గొమాంగో తదితరులు పాల్గొన్నారు.

**విత్తనాలు చల్లిన విద్యార్థులు**

జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ విభాగానికి చెందిన విద్యార్థులు అక్షయ తృతీయ పురస్కరించుకొని పంట పొలాల్లో విత్తనాలు జల్లారు. ఆ విభాగం ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ మిశ్రో, ప్రొఫెషర్ డాక్టర్ సుశాంత్ కుమార్ మహంతి, డాక్టర్ రినా స్వయి, అధ్యాపకులు, వ్యవసాయ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ కిషాన్ మోర్చ ఆధ్వర్యంలో సదరు సమితి అకుసింగి గ్రామంలో అక్షయ తృతీయ కార్యక్రమాలను నిర్వహించారు. ఆ పార్టీ డీఎల్‌పీసీ సభ్యులు సుమంత్ కుమార్ మహరణా, జిల్లా కృషక్ మోర్చ అధ్యక్షుడు కృష్ణ పండ తదితరులు పాల్గొన్నారు.



పొలం పనుల్లో జీఐఈటీ విద్యార్థులు



కృషక్ మోర్చ ఆధ్వర్యంలో అక్షయ తృతీయ వేడుకలు

## క్లుప్తంగా

### పోలీసు జిమ్ ప్రారంభం



జిమ్ ప్రారంభిస్తున్న డీఐజీ సింహ్

**రాయగడ:** జిల్లాలోని చందిలి రిజర్వ్ పోలీసు కార్యాలయం ప్రాంగణంలో పోలీసు జిమ్ ప్రారంభమయ్యింది. దక్షిణాంచల్ డీఐజీ అఖిలేశ్వర్ సింహ్ ముఖ్య అతిథిగా హాజరై జిమ్‌ను మంగళవారం ప్రారంభించారు. వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ముఖ్యంగా పోలీసు విభాగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అత్యాధునిక పరికరాలతో ప్రారంభమైన జిమ్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కవిబర్ దెవురా తదితరులు పాల్గొన్నారు.

### ఈసీహెచ్ఎస్ మొబైల్ యాప్ ప్రారంభం



యాప్ గురించి వివరిస్తున్న విద్యార్థులు

**రాయగడ:** గోపాల్‌పూర్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఈసీహెచ్ఎస్ (ఎక్స్ సర్వీస్ మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్) మొబైల్ యాప్‌ను బరంపురంలోని పాలీ క్లినిక్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ యాప్ మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు సహకారం అందజేసేవిధంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఆర్మీలో పనిచేస్తున్న సైనికులు వారి కుటుంబ సభ్యుల పేర్లు కూడా ఈ యాప్‌లో నమోదు చేసుకొని సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

### వైభవంగా రామాలయ ప్రతిష్ట



దేవతామూర్తులకు అభిషేకం చేస్తున్న దృశ్యం

**కొరాపుట్:** జిల్లా కేంద్రంలోని పూజారిపుట్‌లో రామాలయ ప్రతిష్ట వైభవంగా బుధవారం నిర్వహించారు. సుమారు 600 మంది మహిళలు నరేంద్ర సరోవర్ నుంచి కలశాలతో పవిత్ర నీటిని తీసుకొచ్చారు. ఆ నీటితో రాజస్థాన్‌లో తయారు చేసి దేవతామూర్తుల విగ్రహాలు అభిషేకం చేశారు. మధ్యాహ్నం సమయంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### చీమలమందు తాగి మహిళ ఆత్మహత్య

**టెక్కలి రూరల్:** కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామానికి చెందిన పినిమింటి లక్ష్మీ(37) చీమల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీ భర్త రామారావు రోజు మద్యం సేవించి భార్యాపిల్లలతో గొడవ పడేవాడు. ఇంట్లో దాచి పెట్టిన డబ్బులను ఈ నెల 27న తీసుకుపోయి రోజంతా పూటుగా తాగి సాయంత్రం ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. మనస్థాపానికి గురైన లక్ష్మీ ఇంట్లో ఉన్న చీమల మందును నీటిలో కలుపుకొని తాగింది. గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. లక్ష్మీకి కుమార్తె జగదీశ్వరి, కుమారుడు శ్యాం ఉన్నారు.

### వరకట్న వేధింపులపై కేసులు నమోదు

**కాశీబుగ్గ:** పలాస మండలం, మున్సిపాలిటీ పరిధిలో వరకట్న వేధింపులపై కేసులు నమోదు చేసినట్లు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన కె.ఇందు తన భర్త మహేష్, భర్త కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా, పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన రేఖమ్మ తన భర్త కైలష్‌హోరి రూ.3లక్షలు అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు.

### రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

**నరసన్నపేట:** మండలంలోని ఉర్లాం రైల్వేస్టేషన్ వద్ద బుధవారం ఉదయం ఫలక్‌నామా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ఘటనలో కొత్త పోలవలసకు చెందిన తుంగాన గోవిందరావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాధితుడిని 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జీఆర్‌పీ హెచ్‌సీ మధుసూదనరావు కేసు నమోదు చేశారు.



రాయగడ: కొనుగోలుదారులతో సందడిగా ఉన్న బంగారం దుకాణం



జయపురం: పంట పొలంలో విత్తనాలు చల్లుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి



జయపురం: పొలంలో దుక్కు దున్నుతున్న మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి



జయపురం: సందడిగా ఉన్న బంగారు షాపు

# ఘనంగా అక్షయ తృతీయ

రాష్ట్రవ్యాప్తంగా అక్షయ తృతీయ, వ్యవసాయ పండగలను ఘనంగా బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ ప్రాంతాల్లో రైతులు తెల్లవారుజామున మేలుకొని తమ వ్యవసాయ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. విత్తనాలు విత్తడం మరియు పొలం దున్నడం వంటి ఆచారాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పుడమి తల్లిని వ్యవసాయ దేవతగా భావించి సాగు సంప్రదాయ పూజాదుల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. బంగారం, వెండి దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అలాగే రథయాత్ర కోసం రథాల తయారీని లాంచనంగా ప్రారంభించారు. – సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: మొక్కలకు నీరుపోస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: ప్రత్యేక అలంకరణలో శ్రీజగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు



భువనేశ్వర్: వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యక్షంగా ఏరు పూసిన సీఎం మోహన్‌చరణ్ మాఝి



భువనేశ్వర్: వ్యవసాయ సంచిక ఆవిష్కరిస్తున్న సీఎం మోహన్‌చరణ్ తదితరులు



భువనేశ్వర్: విత్తనాలు జల్లిన సీఎం మోహన్‌చరణ్



పర్లాకిమిడి: రథాల ఇరుసులకు పూజలు చేస్తున్న పూజారులు



కొరాపుట్: పొలంలో పూజలు చేస్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి



మల్కన్‌గిరి: భూమి పూజలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్



నాగలితో దున్నుతున్న ఎమ్మెల్యే నర్సింగ్



కొరాపుట్: శబరి శ్రీక్షేత్రంలో రథ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రథ శిల్పులు



కొరాపుట్: పూరీ నుంచి వచ్చిన రథ చక్రాలు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో రథ నిర్మాణ పూజలు చేస్తున్న రాజ పురోహితుడు నర్సింగ్ త్రిపాఠి



కొరాపుట్: రథ నిర్మాణ పనుల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



భువనేశ్వర్: వరి వంగడాల తాజా పరిశోధనల పరిశీలనలో సీఎం మోహన్‌చరణ్

## ఘోరం..!

- అగ్ని ప్రమాదంలో 14 మంది మృతి

**భువనేశ్వర్:** సెంట్రల్ కోల్‌కతాలోని ఒక హోటల్‌లో మంగళవారం రాత్రి జరిగిన విషాదకరమైన అగ్ని ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులతో సహా మొత్తం 14 మంది మరణించారు. రాష్ట్ర మృతుల్లో జగత్‌సింగ్‌పూర్ జిల్లాకు చెందిన దుష్మంత కుమార్ నాయక్ (46), దుష్మంత కుమార్ స్వంయి (46), మనోజ్ కుమార్ పాత్రో (45)లు ఉన్నట్లుగా గుర్తించారు. వీరు ముగ్గురు ప్రైవేట్ సంస్థ ఉద్యోగులు. అధికారిక పని మీద కోల్‌కతాకు వెళ్లారు. ఈ సందర్భంగా మెచువాపట్టిలోని 6 అంతస్తుల బుర్రా బజార్ హోటల్‌లో బస చేశారు. హోటల్‌లో అకస్మాతుగా మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్మడంతో అత్యధికులు ఊపిరాడక మరణించారు. ఒకరు మాత్రం తప్పించుకునే ప్రయత్నంలో విఫలమై అక్కడికక్కడే మరణించారు. ప్రమాద సమయంలో హోటల్‌లోని 42 గదుల్లో 88 మంది అతిథులు ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000లు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ దుర్ఘటనలో మరణించిన వారి బంధువులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల సాయం, గాయపడిన వారికి రూ.50,000లు సాయం ప్రకటించారు.

## నాణ్యమైన ఔషధాలే లక్ష్యం

**శ్రీకాకుళం క్రైమ్ :** ప్రభుత్వం నిర్దేశించిన ధరలలో ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా జిల్లా ఔషధ నియంత్రణ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఏడీ చంద్రరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా మానవ, పశు సంబంధిత మందులు దొరికే ప్రభుత్వ, ప్రయివేటు దుకాణాల్లో నమూనాలను సేకరించి విజయవాడ, కోలకత్తా వంటి చోట్లకు పంపించి విశ్లేషణ చేయిస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో 327 శాంపిళ్లు సేకరించి విశ్లేషించగా ఏడు రకాల మందులలో నాణ్యతలోపం గుర్తించామన్నారు. వాటిని తయారుచేస్తున్న ఐదు కంపెనీలపై జిల్లాలోని వివిధ కోర్టుల్లో కేసులు నడుస్తుండగా, కొన్ని కేసుల్లో దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

## లారీని ఢీకొట్టిన కారు

**శ్రీకాకుళం రూరల్:** మండల పరిధిలోని పెదపాడు జాతీయ రహదారి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కోల్‌కతా నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ ట్యాంకర్‌ను నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్సై రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆటాడుకుందాం రా..!

- నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో నెలరోజుల పాటు శిక్షణ
- 22 క్రీడాంశాలకు చోటు
- 8 ఏళ్లు పైబడిన బాలబాలికలకు అవకాశం

**శ్రీకాకుళం న్యూకాలనీ:** పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో బాలబాలికలంతా మైదానబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులంతా మరో నెల రోజులపాటు ఆటల్లో మునిగితేలనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు(సమ్మర్ కోచింగ్ క్యాంప్)లను నిర్వహిస్తున్న విషయం విదితమే. జిల్లాలో గురువారం నుంచి శిక్షణా శిబిరాలు మొదలుకానున్నాయి.

**అరకొర నిధులతోనే..**

మే ఒకటి నుంచి మొదలుకానున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులు విధిల్చి చేతులు దులుపేసుకుంది. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలలో మే నెలాఖరు వరకు ఈ శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నారు. ఒక్కొక్క శిబిరానికి కేవలం రూ.7వేలు మాత్రమే కేటాయించారు. ఇందులో శిక్షకుడు/కోచ్‌కు రూ.1500, ఫ్లెక్సీకి రూ.500, స్పోర్ట్స్ మెటీరియల్‌కు రూ.5వేలు వెచ్చించనున్నారు. శిక్షణ సమయంలో క్రీడాకారులకు పోటీలను నిర్వహిస్తారు. ఆఖర్లో ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తారు. అరకొరగా నిధుల కేటాయింపు పట్ల క్రీడాసంఘాల ప్రతినిధులు పెదవివిరిస్తున్నారు.

**ఇవీ విధివిధానాలు..**

- సమ్మర్ కోచింగ్ క్యాంపులలో 8 నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలకు శిక్షణ అందిస్తారు. 16 ఏళ్ల పైబడి ఆసక్తి కలిగినవారు కూడా హాజరుకావచ్చు.
- ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, మరలా సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుంది.
- శాప్ కోచ్‌లతోపాటు పీడీలు/పీఈటీలు, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ అందించేందుకు అర్హులు.
- ప్రతిరోజు క్రీడాకారులకు హాజరు వేయాల్సి ఉంటుంది.
- వారంతాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రోత్సహించాలి.



సాఫ్ట్‌బాల్ శిక్షణలో క్రీడాకారులు



వాలీబాల్ సాధనలో క్రీడాకారులు

### సద్వినియోగం చేసుకోవాలి..

బాలబాలికల ప్రతిభ బయటపడేది వేసవి క్రీడా శిక్షణా శిబిరాలలోనే. జాతీయస్థాయిలో తీర్చిదిద్దే శిక్షకులు జిల్లాలో ఉన్నారు. క్రమం తప్పకుండా హాజరై శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలి. ఒలింపిక్ అసోసియేషన్, క్రీడాసంఘాలు, పీఈటీ సంఘ నాయకులతో కలిసి శిక్షణా కేంద్రాలను కేటాయించాం. కేంద్రానికి రూ.7వేలు చొప్పున కేటాయించారు. ఇందుకు సంబంధించిన విదివిధానాలను శాప్ ప్రకటించింది.

– డాక్టర్ కె.శ్రీధర్‌రావు, డీఎస్‌డీఓ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, శ్రీకాకుళం

- శిబిరాల సమయంలో గ్రామీణ, పాఠశాల స్థాయి స్పోర్ట్స్ క్లబ్‌లను క్రీడాంశాల వారీగా ఏర్పాటు చేయాలి.
- శిక్షణా శిబిరాల సమయంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారిని ప్రత్యేకంగా సానబెట్టి భవిష్యత్తులో జరిగే పోటీలకు సిద్ధంచేయాలి.
- దాతల సహకారం, చేయూతతో శిక్షణా శిబిరాలకు హాజరయ్యే బాలబాలికలకు క్రీడాపరికరాలు, క్రీడాదుస్తులు, షూ, సాక్సులు, స్నాక్స్, మెడల్స్, బహుమతులు, అందించేలా ఆయా కేంద్రాల శిక్షకులు చొరవ తీసుకోవాలి.

**గ్రామీణ క్రీడలకు పెద్దపీట..**

సమ్మర్ కోచింగ్ క్యాంప్ కేటాయింపులో గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేశారు. జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలను కేటాయించారు. అత్యధికంగా అథ్లెటిక్స్‌కు, వాలీబాల్‌కు ఏడేసి చొప్పున కేంద్రాలను కేటాయించగా.. కబడ్డీ 4, ఫుట్‌బాల్ 3, హ్యాండ్‌బాల్ 3, సాఫ్ట్‌బాల్ 3, ఖోఖో 3, బాల్ బ్యాడ్మింటన్ 2, బాక్సింగ్ 2, జూడో 2, తైక్వాండో 2, వెయిట్‌లిఫ్టింగ్ 2, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫెన్సింగ్, సెపక్‌తక్రా, టేబుల్‌టెన్నిస్, టెన్నికాయిట్, ఉషూ క్రీడాంశాల్లో చెరో కేంద్రం చొప్పున శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నారు. అత్యంత ఆదరణ కలిగిన ఆయా ప్రాంతాల్లో పాఠశాలల మైదానాల్లోనే శిక్షణ అందించనున్నారు.

### శిబిరాలు ఎక్కడెక్కడంటే..

**అథ్లెటిక్స్:** జీహెచ్ స్కూల్ పలాస- 9494379648, టెక్కలి- 9492417570, జెడ్పీహెచ్ స్కూల్ కేకే రాజపురం- 8464906752, టీపీఎంహెచ్ స్కూల్ శ్రీకాకుళం- 8500271575, కేవీకే ఇచ్ఛాపురం - 9441024555, పాతపట్నం- 9100736583, జెడ్పీహెచ్ స్కూల్- 8688872304.

**వాలీబాల్:** జెడ్పీహెచ్ స్కూల్ కేశవరావుపేట- 9441011391, జెడ్పీహెచ్ స్కూల్ పైడి భీమవరం- 9849326018, జెడ్పీహెచ్ స్కూల్ ప్రగడపుట్టుగ- 9491569394, జెడ్పీహెచ్ స్కూల్ కొర్ని- 9440955034, జెడ్పీహెచ్ స్కూల్ మాకివలస- 9963753719, జెడ్పీహెచ్ స్కూల్ పాతపట్నం- 9440955034, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బారువ- 9494814087.

**కబడ్డీ:** బలగ శ్రీకాకుళం - 9010406706, జెడ్పీహెచ్ స్కూల్ సింగుపురం- 9642287746, ప్రభుత్వ డిగ్రీ కళాశాల టెక్కలి- 9441262515, జెడ్పీహెచ్ స్కూల్ పల్లెసారధి- 9502983175.

**ఖోఖో:** జెడ్పీహెచ్ స్కూల్ పలాస- 9618583449, కేఆర్ స్టేడియం శ్రీకాకుళం- 9866288802, ఎంజీహెచ్ స్కూల్ ఇచ్ఛాపురం- 9177914135.

**హ్యాండ్‌బాల్:** జెడ్పీహెచ్ స్కూల్ అల్లినగరం- 9493764447, జెడ్పీహెచ్ స్కూల్ పిల్లలవలస- 9966849462, జెడ్పీహెచ్ స్కూల్ పాతటెక్కలి- 7330831517.

**సాఫ్ట్‌బాల్:** జెడ్పీహెచ్ స్కూల్ ఇప్పిలి- 9440436317, జెడ్పీహెచ్ స్కూల్ కేశవరావుపేట- 9705302968, జెడ్పీహెచ్ స్కూల్ కురుడు- 9052500720.

**ఫుట్‌బాల్:** కేఆర్ స్టేడియం శ్రీకాకుళం- 9533691018, కలెక్టరేట్ వద్ద ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ హెచ్-గ్రౌండ్ శ్రీకాకుళం- 9177564623, జెడ్పీహెచ్ స్కూల్ నరసన్నపేట- 8639629920.

**బాల్ బ్యాడ్మింటన్:** జీహెచ్ స్కూల్ ఎచ్చెర్ల- 8074452351, ఎంజేపీ నరసన్నపేట- 7013473337.

**బాక్సింగ్:** ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్,శ్రీకాకుళం- 8977496979, పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ శ్రీకాకుళం- 9989364548.

**జూడో:** జెడ్పీహెచ్ స్కూల్, వప్పంగి- 9440688828, జెడ్పీహెచ్ స్కూల్ పోలవరం - 9550743035.

**తైక్వాండో:** ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణం శ్రీకాకుళం- 9393178455, టౌన్ హాల్ శ్రీకాకుళం- 8919591487.

**వెయిట్ లిఫ్టింగ్:** జీహెచ్ స్కూల్ నరసన్నపేట: 9492299769, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమదాలవలస- 9390745150.

**బ్యాడ్మింటన్:** టెక్కలి- 7799335725

**బేస్‌బాల్:** జెడ్పీహెచ్ స్కూల్ లావేరు- 8639000705.

**బాస్కెట్‌బాల్:** టెక్కలి- 8986951096.

**చెస్:** కోడిరామ్మూర్తి (కేఆర్) స్టేడియం శ్రీకాకుళం - 9908162634.

**క్రికెట్:** పాతపట్నం- 9701454500.

**ఫెన్సింగ్:** టౌన్‌హాల్ శ్రీకాకుళం- 7660874844.

**సెపక్‌తక్రా:** ఎన్టీఆర్ఎం హెచ్‌స్కూల్ శ్రీకాకుళం- 8500828965.

**టేబుల్‌టెన్నిస్:** బాలభాను విద్యాలయం - 9290577033.

**టెన్నికాయిట్:** జీహెచ్‌స్కూల్ పలాస- 9441089592.

**ఉషూ:** ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం శ్రీకాకుళం- 9885734313.

## క్లుప్తంగా

### రైల్వేస్టేషన్‌లో నిందితుడి అరెస్ట్



జీఆర్పీ సిబ్బందికి పట్టుబడిన నిందితుడు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ అపహరించి వెళ్లిపోతున్న వ్యక్తిని జీఆర్పీ సిబ్బంది బుధవారం అరెస్ట్ చేశారు. విజయనగరం జీఆర్పీ ఎస్సై బాలాజీరావు తన సిబ్బందితో కలిసి విజయనగరం రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా ప్లాట్‌ఫాంపై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పట్టుకుని విచారణ చేశారు. ఈ విచారణలో విజయనగరంలోని లంకాపట్నానికి చెందిన పొట్నూరు వెంకటేష్ అలియాస్ విక్కీ(27) రూ.25 వేల విలువ చేసే సెల్‌ఫోన్‌ను అపహరించినట్లు గుర్తించారు. వెంటనే జీఆర్పీ ఎస్సై బాలాజీ కేసు నమోదు చేసి నిందితుడి దగ్గర ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విశాఖ రైల్వేకోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

### 10 లీటర్ల సారా పట్టివేత



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా

నెల్లిమర్ల: నవోదయం 2.0లో భాగంగా నెల్లిమర్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం వెంకటరావు ఆధ్వర్యంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.నాగేశ్వరరావు, సిబ్బందితో గుర్ల మండలంలోని దేవుని కణపాకలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి అచ్చాలు తాలుకా ఖాళీస్థలంలో 10 లీటర్ల సారా పట్టుబడింది. నిందిత వ్యక్తి పరారీలో ఉన్నందున కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దాడుల్లో హెచ్‌సీలు ఎం.అప్పారావు, పీసీలు డీకే శంకర్, కె.సీతాలక్ష్మి పాల్గొన్నారు.

### వృద్ధుడి అదృశ్యం



అదృశ్యమైన వృద్ధుడు అప్పలనాయుడు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామానికి చెందిన పిల్ల అప్పలనాయుడు (75) గడిచిన 20 రోజులుగా కనిపించడం లేదని భార్య పిల్ల పైడమ్మ, కుటుంబసభ్యులు తెలిపారు. ఏప్రిల్ 9న గ్రామం నుంచి బయటకు వెళ్లిన ఆయన మళ్లీ ఇంటికి రాలేదని, ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియలేదని, ఇదే విషయం పోలీస్‌స్టేషన్‌కు కూడా సమాచారం అందించామని చెప్పారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 8374474305, 8187035696 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

### 600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం



సారా బట్టీలపై దాడులు చేస్తున్న ఎస్సై, తదితరులు

సీతంపేట: మండలంలోని చిన్నబెత్తుపురం పరిసర ప్రాంతాల్లో ఎస్సై వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి సారా వండడానికి సిద్ధం చేసి దాచిన 600 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. సారా వండినా, విక్రయించినా, అక్రమరవాణా చేసినా చర్యలు తప్పవని ఎస్సై అమ్మన్నరావు ఈ సందర్భంగా హెచ్చరించారు.

### పసుకుడి చేరిన ఏనుగుల గుంపు



పసుకుడి సమీపంలో పంటపొలాల్లో ఏనుగుల గుంపు

భామిని: ఒడిశా వెళ్లిన ఏనుగుల గుంపు తిరిగి ఆంధ్రా చేరింది. బుధవారం భామిని మండలం పసుకుడి తీరంలో నాలుగు ఏనుగులు రైతుల పంట చేలలో అలజడి సృష్టించాయి. ఒడిశా గ్రామాల మీదుగా ఏనుగుల గుంపు ప్రయాణించడానికి ఆటంకంగా భావించిన ఒడిశా ఫారెస్ట్ అధికారులు, ట్రాకర్స్ ఆంధ్రా వైపు రాత్రిపూట వెళ్లగొడుతున్నారని స్థానిక రైతులు వాపోతున్నారు. ఒడిశా గ్రామాల్లో రాత్రిపూట కరెంట్ తీసివేసి ఏనుగుల గుంపును వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నేడు కార్మికులకు సెలవు

విజయనగరం గంటస్తంభం: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే రోజున కార్మికులకు సెలవు దినంగా ప్రకటించాలి. ఒకవేళ యజమానులు ఆ రోజున పనిచేయించుకుంటే 30 రోజుల లోపు ఏదో ఒకరోజు సెలవు ఇవ్వాలి. ఆ రోజుకు రెట్టింపు వేతనం కార్మికులకు ఇవ్వాల్సి ఉంటుందని కార్మికశాఖ జిల్లా ఉప కమిషనర్ ఎస్.డి.వి.ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# హక్కుల పోరుకు నెత్తుటి తిలకం

- కార్మిక పోరు ఫలించిన వేళ..!
- శ్రమచేద్దాం..శ్రమను గుర్తిద్దాం.. శ్రమను గౌరవిద్దాం
- గొడ్డు చాకిరీ నుంచి కార్మికులకు విముక్తి కలిగిన రోజు
- 1886 మే 1 నుంచి 8గంటల పని విధానం అమలు
- నేడే మేడే



విజయనగరం గంటస్తంభం: ప్రతి సంవత్సరం మే 1వ తేదీన మేడేను అంతర్జాతీయ దినోత్సవం జరుపుకుంటున్న విషయం తెలిసిందే. మేడే జరుపుకునేందుకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. ఆ రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపునిచ్చి వారిని సన్మానించడం. కార్మిక దినోత్సవం మూలాలు 19వ శతాబ్దంలో కనిపిస్తాయి. అప్పుడు అమెరికాలో కార్మికులు తమ హక్కుల కోసం పోరాడారు. 1886, మే 1న దాదాపు 2లక్షల మంది కార్మికులు 8గంటల పనిదినాన్ని డిమాండ్ చేస్తూ భారీ సమ్మెకు దిగారు. అంతేకాకుండా చక్కటి పని వాతావరణాన్ని కల్పించడం, తక్కువ వేతనాలు, బాలకార్మికుల వంటి అంశాలపై కూడా పోరాటం చేశారు.

అమెరికాలో ప్రారంభమైన ఈ ఉద్యమం అటు ఐరోపా దేశాలకు కూడా పాకింది. షికాగోలో హింసాత్మకంగా మారింది. షికాగోలోని హే మార్కెట్ స్క్వేర్‌లో జరిగిన శాంతియుత సమావేశంలో బాంబు పేలడంతో ఈ ఘటన విషాదకరంగా మారింది. ఈ ఘటనలో ఇటు పోలీసులు అటు సమ్మెలో ఉన్న కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఇక చేసేదిలేక ప్రభుత్వం దిగొచ్చి 1894లో కార్మిక దినోత్సవం ఏర్పాటు చేస్తూ ఆరోజు సెలవు దినంగా ప్రకటించింది. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

ఇక..భారత్‌లో మొదటిసారిగా 1923 మే 1వ తేదీన కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నారు. మన దేశంలో ఇతర దేశాల కంటే ముందే కోల్‌కత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్‌లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మేడేను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మేడే పాటిస్తున్నారు.

**కార్మిక సంక్షేమం కోసం..**

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి చిన్న కూలీ వరకూ నేడు సెలవును కచ్చితంగా పాటిస్తారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమ కోసం అనేక పథకాలు ఈరోజు ప్రకటిస్తాయి. రాజకీయ పార్టీలు సైతం కార్మికులను ఆకట్టుకునేందుకు రేపటి వేదికలను తమకు అనుకూలంగా మార్చుకోవడం రొటీన్‌గా మారింది. అలాగే మే 1వ తేదీన తమకు అనుకూలంగా ప్రభుత్వం నుంచి ప్రకటన వస్తుందని కార్మిక సంఘాలు కూడా ఆశిస్తుంటాయి.

**కార్మికులకు పండగ రోజు**

మే డే నాడు అనేక ఉద్యమాలు ప్రాణం పోసుకున్న సందర్భంలో కార్మికులు విజయోత్సవాలు కూడా ఏటా జరుపుకుంటూ వస్తున్నారు. కార్మిక సంఘాలు తమ వేతనాలు పెంచాలని, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరుతూ..ఆందోళనకు దిగుతాయి. మే 1వ తేదీన వారికి అనుకూలంగా కొంత ప్రకటనలు వచ్చే ఛాన్స్ లేకపోలేదు. అందుకే మే డే వస్తుందంటే కార్మికుడికి పండగలాంటిదే. కేవలం సెలవుదినంగానే వారు మే డేను చూడరు. తమకు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు వెట్టి చాకిరీని నుంచి విముక్తి కల్పించిన రోజుగానే భావించి కార్మికులందరూ ఒకచోట చేరి సంబరాలు చేసుకుంటారు. అదే మేడే ప్రత్యేకత.

### సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి



సమానపనికి సమాన వేతనం చట్టాలు అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం, లాభాల్లో నడుస్తున్న రైల్వేలు, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బొగ్గు పరిశ్రమ, విశాఖ ఉక్కు లాంటి 37 ప్రభుత్వరంగ పరిశ్రమలను దేశ ప్రజల ఆస్తులను ప్రైవేటీకరించడం లాంటి చర్యలు దుర్మార్గం. దేశాన్ని మతోన్మాదం వైపు మళ్లిస్తూ ఆర్థికంగా నాశనం చేస్తూ, అభివృద్ధిని అథఃపాతాళానికి తొక్కేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలకు మేము వ్యతిరేకం. అసంఘటిత కార్మికులకు కార్మిక చట్టాలు అమలు వంటి నినాదాలతో జిల్లాలో నేడు కార్మిక దినోత్సవం చేస్తున్నాం.

సీపీఐ విజయనగరం జిల్లా నగర కార్యదర్శి బుగత అశోక్

### కార్మికులపై ప్రభుత్వాల దాడి



కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక వర్గంపై పెద్ద ఎత్తున దాడి చేస్తున్నాయి. గత ప్రభుత్వంతో జరిగిన ఏ ఒక్క ఒప్పందాన్ని అమలు చేయడం లేదు. చిరుద్యోగులను, కార్మికులను రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారు. పనిభారం పెరుగుతోంది. 8గంటల పనిదినం, కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు.కనీస వేతనాలు అమలు, బేరసారాలు ఆడే హక్కు, గ్రాట్యుటీ, బోనస్, పెన్షన్, ఈఎస్ఐ, ఈపీఎఫ్ వంటి చట్టబద్ధమైన హక్కుల్ని నిరాకరించే 4 లేబర్ కోడ్‌ల అమలకు కేంద్రంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మే డే స్ఫూర్తితో 8 గంటల పనిదినాన్ని కాపాడుకుంటాం. లేబర్ కోడ్‌ల అమలును అడ్డుకుంటాం.

-సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్ మోహన్ రావు

### దోపిడీదారులకు చౌకగా భూమి



దోపిడీ దారులైన టీసీఎస్, ఉర్సా కంపెనీలకు ఎకరా భూమి 99పైసలకే ఇవ్వడం దుర్మార్గం. భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నాం. కార్మికుల సహకారాన్ని గుర్తుచేయడమే కాకుండా.. కార్మికుల హక్కులను గుర్తుచేస్తూ..సమాజానికి వారు చేస్తున్న సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలి.

-సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు

## పన్ను ఎగవేతదారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

- జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: పన్ను ఎగవేతదారులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయించేందుకు పోలీస్ యంత్రాంగంతో తహసీల్దార్లు సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్రపన్నుల సంయుక్త కమిషనర్, ఉప కమిషనర్, జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి, సంబంధిత తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఆయన చాంబర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖ వారు జీఎస్టీ బకాయిలు, జనరల్ సేల్స్‌ట్యాక్స్, వ్యాట్ చట్టంలో గల బకాయిలు, రెవెన్యూ రికవరీ కేసులకు కేసులకు సంబంధించి పన్ను ఎగవేతదారుల నుంచి బకాయి రాబట్టేందుకు జిల్లా యంత్రాంగం సహకారం కోరారు. దీనికి జేసీ స్పందిస్తూ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లకు మార్గనిర్దేశం చేశారు. సరైన ప్రణాళికను సిద్ధం చేయాలని సంయుక్త కమిషనర్, రాష్ట్ర పన్నులు, ఉప కమిషనర్ రాష్ట్రపన్నుల శాఖకు సూచించారు. సమీక్షలో అదనపు ఎస్పీ సౌమ్యలత, ఆర్‌డీఓ కీర్తి, జిల్లా అధికారులు, సంయుక్త కమిషనర్, రాష్ట్ర పన్నులు, ఉప కమిషనర్, రాష్ట్ర పన్నులు, జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి, విజయనగరం, సంబంధిత తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల సమాచారం అందించాలి

- జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో మాదక ద్రవ్యాల సమాచారం 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక అన్నారు. జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ మాధవ్ రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల సమాచారం ఎవరి దగ్గర ఏ రూపంలో ఉన్నా అందించాలని, మాదక ద్రవ్యాల నియంత్రణకు సహకరించాలని కోరారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

**జిల్లాలో 394 ఈగల్ క్లబ్‌లు**

ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి బారిన పడకుండా పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లకు మాదక ద్రవ్యాల కిట్లు అందజేశామని, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 394 ఈగల్ క్లబ్‌లను పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షణ పక్కాగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాల తనిఖీ సమయంలో రవాణాశాఖ అధికారులు అన్ని కోణాల్లో తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

**నవోదయం 2.0 కింద అవగాహన**

ఎక్సైజ్ ఏఈఎస్ జీవన్ కిశోర్ మాట్లాడుతూ నవోదయం 2.0 కింద జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర తనిఖీల్లో భాగంగా రాయగడ, కొరాపుట్ జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 137 గ్రామాలను సారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాంబాబు, ఇన్‌చార్జి డీఈఓ రమాజ్యోతి, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఇ.అప్పన్న, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి ఆశ, దివ్యాంగుల శాఖ ఎ.డి కవిత, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీలో అగ్నిప్రమాదం

- రెండు కంప్యూటర్లు దగ్ధం



ప్రమాదంలో తగలబడిన కంప్యూటర్లు

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. షాట్ సర్క్యూట్ కారణంగా జెడ్పీలోని ఇంజినీరింగ్ విభాగంలో రెండు కంప్యూటర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. జెడ్పీలో పని చేస్తున్న సిబ్బంది సత్యనారాయణ వెంటనే అగ్నిమాపక శాఖకు ఫోన్ చేయడంతో హుటాహుటిన శకటంతో సిబ్బంది వచ్చి జెడ్పీలో తగలబడుతున్న కంప్యూటర్‌లను అర్పేయత్నం చేశారు. దాదాపు మూడు గంటల తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదం కారణంగా రూ.లక్షా 90 వేల నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరరావు చెప్పారు.

## భక్తుల దుర్మరణం దురదృష్టకరం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు



డాక్టర్ డీవీజీశంకరరావు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్

విజయనగరం అర్బన్: సింహాచలం చందోత్సవానికి వచ్చిన ఏడుగురు భక్తుల దుర్మరణం దురదృష్టకరమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. సింహాద్రి అప్పన్న దర్శనార్థం వచ్చిన భక్తులు గోడకూలి మృత్యువాత పడడం విచారకరమన్నారు. వారి కుటుంబాలకు తన సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుని వారికి అవసరమైన సహాయ సహకారాలందించాలని డాక్టర్ శంకరరావు కోరారు.

### హత్యకేసులో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

సాలూరు: పాచిపెంట మండలం తంగ్లాం గ్రామంలో గిరిజనుడు పోయి అప్పలస్వామి హత్యకేసులో నిందితుడు పోయి రాజును అరెస్టుచేసినట్లు డీఎస్పీ రాంబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని రూరల్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అప్పలస్వామి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారన్నారు. పెళ్లికి వెళ్లి వస్తుండగా పోయి అప్పలస్వామిని హత్యచేసినట్లు నిందితుడు పోయి రాజు స్వయంగా వీఆర్‌ఓ వద్ద లొంగిపోయాడని తెలిపారు. భూ వివాదంతోపాటు చిల్లంగి అనుమానంతో అప్పలస్వామిని రాజు హత్యచేసినట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ రామకృష్ణ, పట్టణ సీఐ అప్పలనాయుడు, పాచిపెంట ఎస్సై వెంకట సురేష్ పాల్గొన్నారు.

### ఐదుగురిపై దాడి కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని కొండగూడెం గ్రామంలో తాడి పార్వతిపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు ఈ నెల 25 న దాడి చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పార్వతిపై శుక్రవారం రాత్రి గ్రామస్థులు దాడి చేయడంతో గ్రామంలో పెద్దల వద్దకు వెళ్లారు. అక్కడ ఎటువంటి న్యాయం జరగక పోవడంతో బుధవారం జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వ్యక్తికి గాయాలు



108 వాహనంలో బాధితుడిని తరలిస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి అరసాడ జంక్షన్ వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో బుధవారం ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మగ్గూరు గ్రామానికి చెందిన రొంగలి సత్యనారాయణ జంక్షన్ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే పనిలో ఉండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షార్ట్‌సర్క్యూట్‌కు గురయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న 108 వాహన సిబ్బంది బాధితుడిని రాజాం సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

**తేనెటీగల దాడి: ఏడుగురికి గాయాలు**

వంగర: మండల పరిధి శివ్వాంలో బుధవారం పెళ్లి జరుగుతున్న సమయంలో తేనెటీగలు దాడిచేయడంతో ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. పెళ్లికుమార్తెను గ్రామ సమీపంలోని ఓ చెట్టు వద్ద నుంచి ఇంటికి తీసుకువెళ్లేందుకు బంధువులంతా అక్కడికి చేరుకున్నారు. అంతలో తేనెటీగల పట్టు చెదిరిపోవడంతో అక్కడ ఉన్న బిల్లాన రామారావు, అలజింగి ప్రేమ్‌కుమార్, బిల్లాన ప్రతాప్, కుప్పిలి నితిన్, కిరణ్‌తోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారందరినీ వంగర పీహెచ్‌సీకి తరలించగా వైద్యురాలు సీహెచ్‌జ్యోతి ప్రథమ చికిత్స అందించారు. బాధితులంతా శివ్వాం గ్రామస్తులే.

**తాటిచెట్టు పైనుంచి జారిపడి వ్యక్తికి గాయాలు**



గాయపడిన పైడియ్య

వంగర: మండల పరిధి అరసాడ గ్రామానికి చెందిన దమరసింగి పైడియ్య తాటిచెట్టుపై నుంచి జారిపడి గాయపడ్డాడు. బుధవారం గ్రామ సమీపంలోని తాటి చెట్టు ఎక్కి తాటికాయలు దింపేందుకు వెళ్లాడు. తాటికాయల గెల తీస్తుండగా అదుపు తప్పి కిందపడిపోవడంతో ఎడమ చేయి సోల్డర్ జారిపోగా, పక్కటెముకకు తీవ్రంగా గాయమైనట్లు వైద్యులు వెల్లడించారు. బాధితుడు రాజాంలో చికిత్స పొందుతున్నాడు.

## ఫ్రెండ్‌కి సెండ్ ఆఫ్ ఇచ్చేందుకు వెళ్తూ..

- ట్రాక్టర్ కింద పడి విద్యార్థిని మృతి
- బైక్ అదుపు తప్పి ప్రమాదం





మృతి చెందిన నూకమ్మ అలియాస్ ఉమ,(ఇన్‌సెట్లో ఉమ (ఫైల్)

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామానికి చెందిన నూకమ్మ అలియాస్ ఉమ మంగళవారం తమ ఇంట్లో జరిగిన శుభ కార్యక్రమానికి తనతోపాటు డిగ్రీ చదువుతున్న ఫ్రెండ్స్‌ను ఆహ్వానించింది. స్నేహితులంతా కలిసి మంగళవారం ఆటపాటల్లో మునిగితేలారు. బుధవారం తన ఫ్రెండ్ షర్మిలకు సెండ్ ఆఫ్ ఇచ్చేందుకు గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై మక్కువ వెళ్తుండగా టాక్టర్ రూపంలో మత్యువు నూకమ్మను కబళించింది. అంతవరకు గ్రామంలో అందరితో కలివిడిగా ఉండి, ఫ్రెండ్‌ను మక్కువలో డ్రాప్ చేసి వస్తానని చెప్పి, తిరిగిరాని లోకానికి వెళ్లిపోయిందంటూ గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. తూరుమామిడి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని కురసాన నూకమ్మ అలియాస్ ఉమ(20) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై హెడ్ కానిస్టేబుల్ ఎస్. శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూకమ్మ తన ఫ్రెండ్ షర్మిలకు సెండాఫ్ ఇచ్చేందుకు గ్రామం నుంచి మక్కువకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మార్గమధ్యంలోని శాంతేశ్వరం గ్రామం సమీపంలో ఎదురుగా ట్రాక్టర్ మితిమీరిన వేగంతో వచ్చింది. టాక్టర్‌ను తప్పించే ప్రయత్నంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోవడంతో నూకమ్మ తలపై నుంచి ట్రాక్టర్ టైర్ వెళ్లగా అక్కడికక్కడే మృతిచెందింది. నూకమ్మ బొబ్బిలిలోని ఓ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తండ్రి జనార్దనరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సాలూరు ఆస్పత్రికి తరలించారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి..**

రాజాం సిటీ: పట్టణ పరిధి డోలపేట శివాలయం వీధిలో నివాసం ఉంటున్న తాతపూడి దుర్గారావు (54) చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. సీఐ అశోక్ కుమార్, ఎస్సై రమణమూర్తి తెలిపిన వివరాల మేరకు రేగిడి మండలం పనసలవలస గ్రామానికి చెందిన దుర్గారావు రెండేళ్ల క్రితం డోలపేట వచ్చి స్థిరపడ్డాడు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తెకు వివాహం చేసి పెద్దకుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. 27 ఏళ్ల కుమారుడికి వచ్చిన సంబంధాలు కుదరడంలేదు. అలాగే ఈ నెల 23న కూడా సంబంధం వచ్చి కుదరకపోవడంతో దుర్గారావు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మద్యం అలవాటు ఉన్న ఆయన మద్యం తాగి రాత్రి పదిగంటల సమయంలో గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. 11 గంటల సమయంలో భోజనానికి పిలుస్తున్నా ఎప్పటికీ పలకకపోవడంతో ఎలాగోలా తలుపు తీశారు. అప్పటికే ఉరివేసుకున్న దుర్గారావును కిందికి దించి కొన ఊపిరితో ఉండడంతో శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు ధనుంజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

**రైల్వే గేటు సమీపంలో మృతదేహం**



కొమరాడ: పార్వతీపురం గుమడ రైల్వేస్టేషన్ల మధ్య స్వామినాయుడు రైల్వే గేటు సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి కుడిచేతిపైన అమ్మ అనే పచ్చబొట్టు ఉందని, నీలం రంగు నెక్ బనియన్, నలుపు రంగు షార్టు ధరించి ఉన్నాడన్నారు.ఐదు అడుగుల ఎనిమిది ఇంచిల పొడవు కలిగి లావుగా ఉన్నట్లు చెప్పారు. రంగు చామన ఛాయలో ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు ఫోన్ 9490617089,8309901038 నంబర్లకు తెలియచేయాలని కోరారు.

**గుర్తుతెలియని వ్యక్తి..**



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండల పరిధిలోని బొండపల్లి-చంద కపేట గ్రామాల మధ్యలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెచ్‌సీ కృష్ణారావు తెలిపారు. టిట్లాఘర్ రైల్వే టికెట్ కలిగి ఉండి సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉన్న, నీలిరంగు పుల్ టీషర్టు, నల్లరంగు ప్యాంటు ధరించి ఉన్న వ్యక్తి పట్టాలపై మృతి చెందినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి రైలులో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించామని మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయనగరం రైల్వే ఎస్సై ఫోన్ నంబర్ 9490617089, బొబ్బిలి, విజయనగరం జీఆర్‌పీ హెచ్‌సీల ఫోన్ 944101333095, 9591813163 నంబర్లను సంప్రదించి వివరాలు అందచేయాలని కోరారు.

**విద్యుత్ షాక్‌కు గురై మూడు ఆవుల మృతి**

పాచిపెంట: మండల కేంద్రానికి చెందిన రైతు మట్టపర్తి సురేష్‌కు చెందిన మూడు ఆవులు కొటికిపెంట పంచాయతీ గోగాడవలస సమీపంలో సాగు చేస్తున్న పొలం దగ్గర బుధవారం విద్యుత్ షాక్‌తో మతిచెందాయి. సోమవారం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు నేలకొరిగాయని విద్యుత్ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోక పోవడం వల్ల తన ఆవులు మతి చెందాయని రైతు సురేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.

### కళాక్షేత్రాన్ని సందర్శించిన మాజీ ఎంపీ బెల్లాన

రాజాం: పట్టణంలోని వస్త్రపురికాలనీ సమీపంలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన జీఎంఆర్ వరలక్ష్మి కళా క్షేత్రాన్ని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కళాకారుల కోసం కళాక్షేత్ర భవన నిర్మాణానికి అప్పటి ఎంపీ బెల్లాన నిధులు సమకూర్చారు. అక్కడి స్థలాన్ని జీఎంఆర్ ఉచితంగా అందజేసింది. కళాక్షేత్రం నిర్మాణం పూర్తికావడంతో క్షేత్రాన్ని సందర్శించడంతో పాటు కళాకారులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ యడ్ల గోపాలరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### స్పందించిన సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎక్స్‌రే ఫిల్మ్‌లు లేక ఎం.ఎల్.సి రోగులు అవస్థలు పడుతున్న అంశంపై 'ఎంఎల్‌సీ రోగులకు తిప్పలు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. ప్రస్తుతం ఉన్న ఎక్సరే, సిటీ, ఎంఆర్ఐ ఫిల్మ్‌లు రోగులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు తెలిపారు.